విశాఖపట్నం



మన ఏయూ...ఘన వైభవం...





విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా జిమ్నాజియం మైదానంలో హ్యూమన్ స్పెలవుట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు ఒక క్రమ పద్ధతిలో నిలుచుని ~ఏయూ100 రూపాన్ని ఇచ్చారు. శతాబ్ది ఉత్సవాలలో భాగంగా అందరినీ భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ శతాబ్ది ఉత్సవాలలో ప్రతీ వ్యక్తి భాగమవుతూ విజయవంతం చేయడం పట్ల అభినందనలు తెలిపారు. శతాబ్ది ఉత్సవాలలో ప్రత్యేక కార్యక్రమంగా ఇది చరిత్రలో నిలచిపోతుందన్నారు. ఏయూ...ఏయూ అంటూ నినాదాలతో మైదానం హోరెత్తింది. శతాబ్ది వేడుకలు జరుపుకుంటున్న ఏయూకు శుభాకాంక్షలు తెలుపుతూ ఉద్యోగులు, విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, కార్యక్రమం సమన్వయకర్త ఆచార్య ఎన్.విజయ్ మోహన్, ఏ.పల్లవి, ఎన్.ఎం. యగంధర్, సి.హెచ్ ఆశా ఇమ్మానియల్ రాజు, ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చిత్రకళా విభాగంలో కళ కార్యక్రమం



విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళా విభాగం ఆధ్వర్యంలో ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా కళ సెంటెనల్ సగా కార్యక్రమం ఈనెల 19వ తేదీ నుండి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఫైన్ ఆర్ట్స్ విభాగపు అధిపతి ఆచార్య సింహాచలం, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపాల్, డీన్‌లు, ఆచార్యులు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టాలి

విశాఖపట్నం, జననేత న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టాలని డీఈవో ప్రేమకుమార్ పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన ఎంఈఓల సమావేశంలో డీఈవో మాట్లాడారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్స్ కొరకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో కృషి చేసి, ప్రత్యేక కార్యాచరణ ద్వారా అడ్మిషన్స్ గణనీయంగా పెంచాలని, దీనికోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డిఇఓ కోరారు. ఈ సందర్భంగా బడి పిలుస్తోంది పోస్టర్‌ను కరపత్రాన్ని కలెక్టర్ ద్వారా విడుదల చేసిన నేపథ్యంలో ఎంఈఓల ద్వారా మండలాలకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్వ శిక్ష అభియాన్ ఏపీసి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ద్వారా 17వ తేదీ నుండి 23 వరకు విద్యావారోత్సవాలు నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వర్‌రావు, వివిధ మండలాల ఎంఈఓలు, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారులు అడివివరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇమంది పైడిరాజు పాల్గొన్నారు.



24న 'వనిత వేవ్ @100'



విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డా. దుర్గాబాయి దేశ్ ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన 'వనిత వేవ్ ఏ100' ది శతాబ్ది వాక్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం బీచ్ రోడ్ నందు గల కాళీమాత మందిరం నుండి ఉదయం 6.30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పీ.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, దుర్గాబాయి దేశ్ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ సంచాలకులు ఆచార్య పల్లవి మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపాల్స్, పలువురు డీన్లు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మిస్సెస్ ఏవీఎన్ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం

విశాఖపట్నం, జననేత న్యూస్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మిస్సెస్ ఏవీఎన్ కాలేజ్ విద్యార్థులు మార్కుల ప్రభంజనం సృష్టించారు.



సింగిరాజు శ్రీ సాయి స్నిగ్ధ జూనియర్ బైపిసిలో 448 /455, జూనియర్ ఎంపీసీ రేణుక 415/470, ఎం.నరేంద్ర జూనియర్ సిఈసి 446/500, జూనియర్ హెచ్ఈసి ఎం.కృష్ణ చైతన్య 414/500, ఆర్.చిన్నారి జూనియర్ ఎంఎల్‌టి 459, జూనియర్ ఎంపిఎస్‌డబ్ల్యు తిస్సేన్ 471, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బి.రీతు వర్ధిని 975/1000 సీనియర్ బైపిసి, ఎస్.వేదవల్లి సీనియర్ ఎంపీసీ 920/1000, ఆర్.యశస్విని సాయి వల్లిక సీనియర్ ఎంఈసి 925/1000, కె.వెంకటలక్ష్మి 909, సీనియర్ ఎంఎల్‌టి సిహెచ్ స్వాతి సీనియర్ ఎంపిఎస్‌డబ్ల్యు 909 మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ అదీప్ బానోజీరావు, కళాశాల ప్రిన్సిపల్ పి.కృష్ణకుమారి, వైస్ ప్రిన్సిపల్ డి.సంతోష్ కుమార్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఏయూ శతాబ్ది ముగింపు వేడుకలకు సమగ్ర ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని, విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఈ నెల 27న జరగనున్న శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల నిర్వహణపై ఏయూ వీసీ జి.పి. రాజశేఖర్, జేసీ గొబ్బిళ్ల విద్యాధరిలతో కలిసి జిల్లా అధికారులు, యూనివర్సిటీ అధికారులతో ఏయూ సెనేట్ హాలులో సంయుక్త సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్చ్యువల్‌గా పాల్గొన్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ భరత్ గుప్తా పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. చెక్ లిస్టు ప్రకారం అన్ని ఏర్పాట్లూ చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ముందుగా ఏయూ తరపున చేయబోయే కార్యక్రమాలను, ప్రాథమిక ప్రణాళికలను వీసీ జీజీ రాజశేఖర్ వివరించారు. ముగింపు వేడుకులను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించడానికి నిర్ణయించామని, సుమారు 25 వేల మంది భాగస్వామ్యం కానున్నారని, ఆ రోజు మధ్యాహ్నం 4.00 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. దీనికి సంబంధించిన ఇన్చార్జి అధికారులను నియమించామని చెప్పారు. ఉప రాష్ట్రపతి, సచిన్ తెండూల్కర్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అడ్వైజరీ (సలహా) కమిటీలో యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉంటారని, వర్కింగ్ (నిర్వహణ) కమిటీ జిల్లా యంత్రాంగం, యూనివర్సిటీ అధ్యాపకులతో సమన్వయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ముగింపు వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్, ఉప ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి, సచిన్ తెండూల్కర్ హాజరుకానున్న నేపథ్యంలో ప్రోటోకాల్, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు చెప్పారు. వివిఐపీల రాక, బస, భద్రత అంశాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సాధారణ పౌరులు మధ్యాహ్నం 2:00 గంటలకే తమకు కేటాయించిన స్థానాల్లో కూర్చునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీవీఐపీలు వచ్చే లోపు విద్యార్థుల కోసం ప్రత్యేక సైడ్ స్టేజ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 100 సంవత్సరాల చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. జిల్లా యంత్రాంగం, ఏయూ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఏయూలో "వీక్ష" ఫోటో ఫెస్ట్ ప్రారంభం





విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల భాగంగా జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఫోటో ఫెస్ట్ "వీక్ష" ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ టీఎల్ఎన్ సభా హాల్‌లో ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ సంస్థ చరిత్రను నిలుపుకునే విషయంలో విజువల్ స్టోరీటెల్లింగ్ ప్రాముఖ్యతను వివరించారు. గత శతాబ్ద కాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం సాధించిన విద్యా, సాంస్కృతిక, సామాజిక విజయాలను ప్రతిబింబించే శక్తివంతమైన మాధ్యమంగా "వీక్ష" నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. గతాన్ని వర్తమానంతో అనుసంధానించేలా ఫోటో ప్రదర్శనను రూపొందించిన విభాగాన్ని ఆయన అభినందించారు. ఈ ప్రదర్శనలో విశ్వవిద్యాలయం స్థాపన నుంచి ఇప్పటివరకు జరిగిన ముఖ్య ఘట్టాలు, ప్రముఖ వ్యక్తులు, విద్యా విజయాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతిబింబించే అరుదైన ఫోటోలు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు, అధ్యాపకులు, సందర్శకులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షిస్తూ విశ్వవిద్యాలయం అభివృద్ధి పథాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జలది రవి, విభాగాధిపతి డాక్టర్ సి.ఎం.వినయ కుమార్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ఫోటోగ్రఫీ ఫ్యాకల్టీ పి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఫోటో ఫెస్ట్‌కు సర్ బి.ఎన్.శర్మ మనవడు మహేష్ హాజరయ్యారు. 1935-1940 కాలంలో అప్పటి వైస్-చాన్సలర్ డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆయన కుటుంబానికి చెందిన 'సీత విలాస్' భవనంలో నివసించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడమే కాకుండా, విద్యార్థుల్లో విజువల్ మీడియా ద్వారా చరిత్రను, సామాజిక మార్పును డాక్యుమెంట్ చేయాలనే ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ఫోటో ఫెస్ట్‌ను నిర్వహించారు.

పారిశుధ్య నిర్వహణలో లోపాలను సవరించి మెరుగుపరచండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, జననేత న్యూస్: నగరంలో పారిశుధ్య నిర్వహణలో లోపాలు కనిపిస్తున్నాయని వాటిని వెంటనే సవరించాలని లోపాలు ఉంటే చర్యలు తప్పవని, తాగునీటి సరఫరాలలో నిత్యం నాణ్యతా పరీక్షలు చేపట్టాలని, రోడ్లపై, వీధులలో భవన నిర్మాణ వ్యర్థాలు, ఫుట్ పాత్ లపై ఆక్రమణలు లేకుండా తగిన చర్యలు తక్షణమే చేపట్టాలని, ప్రతి భవన నిర్మాణం వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకొని నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. నార్త్ జోన్, 25వ వార్డులో బీవీకే కాలేజ్ జంక్షన్ నుండి సీతంపేట జంక్షన్ మీదుగా మధురానగర్ పరిసర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ బి.రాము, సహాయక వైద్యాధికారి డాక్టర్ అప్పలనాయుడు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ తిరుపతిరావులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ 25 వ వార్డులో పర్యటిస్తూ మధురా నగర్ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల నివాసితుల ఇండ్ల ముందు, వాణిజ్య సముదాయాల ముందు , సాయిబాబా దేవాలయం వద్ద అధికంగా వ్యర్థాలు ఉన్నందున, నిత్య పారిశుధ్య నిర్వహణపై సంబంధిత శానిటరీ సూపర్వైజర్ ను, వార్డు శానిటేషన్ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో వారి విధి విధానాలు, పిన్ టు పిన్ కార్యాచరణ, నిత్యం వ్యర్థాలు సేకరించి తరలించే ప్రక్రియ, వాహనాల పనితీరు, విధుల నిర్వహణలో అలసత్వం కనిపిస్తుందని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆ సమీపంలో స్థానికులు ఇంటింటి నుండి నిత్యం వ్యర్థాల సేకరణ , తరలింపు ప్రక్రియ జరుగుటలేదని కమిషనర్‌కు తెలియపరచగా, శానిటరీ సూపర్వైజర్ రామారావు, వార్డు శానిటేషన్ కార్యదర్శి సతీష్ కుమార్ లను వారి నిత్య కార్యాచరణలో వివరాల పై ఆరా తీసి వారి విధుల నిర్వహణలో లోపాలు, అలసత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయని వారిని వెంటనే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు సిద్ధం చేసి తనకు నివేదించాలని జోనల్ కమిషనర్ రాముకు కమిషనర్ ఆదేశించారు. వార్డులో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా లోపించిందని, వెంటనే సవరించి సరిచేయాలని , నిత్యం వార్డులలో ప్రత్యేక పర్యవేక్షణ జరపాలని సహాయక వైద్యాధికారి డాక్టర్ అప్పలనాయుడుకు కమిషనర్ ఆదేశించారు. జోన్ లో అన్ని వార్డులలో, సచివాలయాల పరిధిలో నిత్యం ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ ,తరలింపు , వాహనాల పనితీరు, సానిటరీ సూపర్వైజర్లు ,సానిటరీ ఇన్స్పెక్టర్లు ,వార్డు శానిటేషన్ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల విధుల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా పారిశుధ్య నిర్వహణ ను మెరుగుపరిచేలా నిత్య పర్యవేక్షణ జరపాలని జోనల్ కమిషనర్ కు కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీనివాసు ,భరణి, టిపిఓ ప్రవీణ్, శానిటరీ సూపర్వైజర్ రామారావు, వార్డు శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లడ్ లైట్లను ప్రారంభించిన ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్




విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే విధంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లను ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్ ప్రారంభించారు. హోమియో వైద్యశాల నుంచి నాగార్జున హాస్టల్‌కి వెళ్లే మార్గంలో, అర్థశాస్త్ర విభాగం నుంచి కలెక్టర్ బంగాళాకి వెళ్లే మార్గంలో మధ్యలో ఉన్న కూడలిలో నూతనంగా వీటిని ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో విద్యార్థులు సురక్షితంగా విభాగాల నుంచి హాస్టల్స్‌కు వెళ్లడానికి ఇది ఈ ఫ్లడ్ లైట్లు ఉపయుక్తంగా నిలుస్థాయి. కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు వెలుగులో ఈ కూడలి మార్గం ఎంతో ప్రకాశవంతంగా మారింది. అదేవిధంగా ఏయూలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ దీపాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఇంజనీరింగ్ అధికారులు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా సోలార్ ప్లాంట్లు

విశాఖపట్నం, జననేత న్యూస్: 'పీఎం సూర్యఘర్ కింద ఎస్సీ-ఎస్టీ సోలరైజేషన్' పథకాన్ని ప్రారంభించినట్టు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్‌తో కలిసి ప్రారంభించారు. చినవాల్తేరులోని రెల్లివీధిలో సోలార్ ప్లాంట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీతో సుమారు రూ.1.2 లక్షల విలువైన 2 కిలోవాట్ల సోలార్ ప్లాంట్లను పేదలకు పూర్తిగా ఉచితంగా అందిస్తారని అన్నారు. వీటి ద్వారా నెలకు 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, పాత ఉచిత విద్యుత్ పథకం కూడా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.



ఆచార్య ఎస్వీ జోగారావు సాహితీ వరివస్య గ్రంథ ఆవిష్కరణ



విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్ర విశ్వకళాపరిషత్ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ఆచార్య వెలమల సిమన్న రాసిన ఆచార్య ఎస్వీ జోగారావు సాహితీ వరివస్య అనే గ్రంథాన్ని ఆంధ్రవిశ్వకళా పరిషత్తు తెలుగు శాఖ సమావేశ మందిరంలో పద్మశ్రీ, పద్మభూషణ్ విశ్వ హిందీ పరిషత్తు అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఆవిష్కరించారు. ఆచార్య యార్లగడ్డ మాట్లాడుతూ గురువు జోగారావుపై పుస్తకం రాయడం సంతోషదాయకం అని అన్నారు. ఈ పుస్తకం రాసి తన గురువు రుణాన్ని సిమ్మన్న తీర్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ఆంత్రోపాలజీ ఆచార్యులు పెద్దయ్య, తెలుగు శాఖ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య నల్లా సత్యనారాయణ, విశ్రాంత ఆచార్యులు గజ్జా యోహానుబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా



సకాలంలో అర్జీలు పరిష్కారానికి చర్యలు



పాడేరు, జననేత న్యూస్: మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో ఆమెఅధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు ఇచ్చే అర్జీలను పక్కాగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని పరిస్థితులుంటే, సంబంధిత అధికారులు ముందస్తు అనుమతి పొందాలన్నారు. శాఖపరమైన ఎటువంటి అనుమతినైనా సంబంధిత శాఖకు చెందిన ఉన్నతాధికారి వచ్చి విధిగా అనుమతి పొందాలన్నారు. జిల్లా అభివృద్ధిపై నిర్వహించే సమీక్షలకు పక్కా ప్రణాళికతో హాజరుకావాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని, గ్రామ స్థాయి సమస్యలపై ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా అక్కడే అధికారులు పరిష్కరించాలన్నారు. పైస్థాయి నుంచి వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, జేసీ శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, డీఆర్వో నీలకంఠరావు గిరిజనుల నుంచి 127 వినతులను స్వీకరించారు.

మారుమూల గ్రామాల్లో జేసీ పర్యటన

పాడేరు, జననేత న్యూస్: మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకోనెల గ్రామాల్లో జేసీ శ్రీపూజ పర్యటించారు. గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 12వ తేదీన మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, బాధిత గిరిజనులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన జేసీ గురువారం బూరిగ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శుక్రవారం వీఆర్వో గ్రామానికి వెళ్లి ఎంతమందికి మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలనే దానిపై నివేదికను తహశీల్దార్‌కు అందజేయాలని ఆదేశించారు. వాటిని పరిశీలించి మరణ ధ్రువపత్రాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయా?, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం లేదని వారు చెప్పడంతో ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇతర సమస్యలు ఉంటే చెప్పాలని గిరిజనులను ఆమె అడిగిన తీరుకు వారు ఎంతో సంతోషించారు. ఇప్పటి వరకు ఏ అధికారి తమ సమస్యలను ఓపికగా విన్న సందర్భం లేదని వారు చెప్పారు. జేసీ వెంట అనంతగిరి తహశీల్దార్ వీరభద్రాచారి, డీటీ మాణిక్యం, వీఆర్వో రాంబాబు, తదితరులు ఉన్నారు



అనకాపల్లి



విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించాలి

అనకాపల్లి, జననేత న్యూస్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, వారు ఉన్నత శిఖరాలకు చేరేందుకు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షాల ఫలితాల విడుదల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), ఏపీ మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెసిడెన్షియల్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు రావడం అభినందనీయమని అన్నారు. ఈ ఫలితాలను అధ్యయనంచేసి, ఏ సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చాయో గమనించి, ఆయా సబ్జెక్టుల బోధనను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సగటుకన్నా తక్కువ ఉత్తీర్ణత నమోదైన కళాశాలల నిర్వాహకులపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఇందుకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం త్వరలో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, అందువల్ల వారికి వెంటనే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా విద్యా శాఖ, ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు



ప్రజా భాగస్వామ్యంతో గంజాయికి అడ్డుకట్ట

అనకాపల్లి, జననేత న్యూస్: ప్రజా భాగస్వామ్యంతో గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని గొలుగొండలో పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత, విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతంలో గొలుగొండ, నాతవరం, రోలుగుంట మండలాల్లో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోందన్నారు. ఈ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. పాకలపాడు గ్రామంతో పాటు గంజాయి రవాణా సాగుతున్న గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పోలీసులు తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హ్, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, ఎస్ఐ పి.రామారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహశీల్దార్ కాకర నూకరాజు, స్థానిక టీడీపీ నాయకులు అప్పలనాయుడు, చిటికెల సాంబమూర్తి, కొల్లి సత్తిబాబు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు రాజాన వీరసూర్యచంద్ర, పుల్లేటికుర్తి రమేష్, రాయపురెడ్డి జమీలు, తదితరులు పాల్గొన్నారు

